క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని వెంకునాయుడుపేటకు చెందిన బి.చినబాబుకు శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్ సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. ఇటీవల మేజర్ సర్జరీ చేయించుకున్న చినబాబు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు రూ.70 వేలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కర్రి రాంగోపాల్, పెట్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

శివాలయానికి నాగాభరణం బహూకరణ

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని 28వ వార్డులో వెలిసిన దక్షిణామూర్తి శివాలయానికి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జర్నలిస్టు చింతకల కిశోర్ దంపతులు రూ.50 వేలు విలువ నాగాభరణం బహూకరించారు. కౌన్సిలర్ చింతకాయల పద్మావతి సమక్షంలో అందజేశారు. వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

కమనీయంగా శివపార్వతుల కల్యాణం

మాడుగుల: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు శివాలయాల్లో శనివారం ఉదయం శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మాడుగుల కృష్ణా భూపాలేశ్వర స్వామివారి దేవాలయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఉబ్బ లింగేశ్వర స్వామి, ఉమాపార్వతి భీమేశ్వర, తదితర ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

బ్రహ్మలింగేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే గణేష్



బ్రహ్మలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మహా శివరాత్రి పురస్కరించుకుని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి బలిఘట్టం బ్రహ్మలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శెట్టి చిన్న, కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు.

బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక ప్రచారం



కశింకోటలోని శివాలయంలో ప్రచారం చేస్తున్న బ్రహ్మకుమారీలు

కశింకోట : స్థానిక శివాలయంలో బ్రహ్మ కుమారీలు శనివారం ప్రచారం నిర్వహించారు. భక్తులకు ఆత్మ, పరమాత్మ గురించి వివరించారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. రాజయోగం, ధ్యానం ప్రాముఖ్యతను చార్టుల ద్వారా తెలిపారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

ఘనంగా వెంకన్న తిరువీధి



మునగపాక ఇందిరమ్మ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

మునగపాక : స్థానిక ఇందిరమ్మ కాలనీలో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఊరేగింపు కాలనీలోని ప్రధాన వీధి మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకుంది. భక్తులు పెద్ద ఎత్తున శ్రీనివాసుడిని దర్శించుకున్నారు.

శివ శివ శంకర.. భక్తవ శంకర

శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వేకువజామునే ఆ దేవదేవుడు అనుగ్రహం కోసం భక్తులు పరితపించారు. ఓం నమః శివాయ అని స్మరిస్తూ భోళాశంకరుడి ఎదుట ప్రణమిల్లారు. తొలుత నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు పోటెత్తారు. శివుడి దర్శన భాగ్యంతో పరవశించిపోయారు. పలుచోట్ల అన్నసమారాధనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- శైవక్షేత్రాలు కిటకిట
- కల్యాణపులోవ తిరునాళ్లకు పోటెత్తిన యాత్రికులు
- కిక్కిరిసిన స్నానాల రేవు
- పలుచోట్ల అన్నసమారాధనలు



రావికమతం: అన్నదానం కౌంటర్‌లో వడ్డిస్తున్న తహసీల్దార్, ప్రజా ప్రతినిధులు



రావికమతం: మజ్జిగ, లస్సీ పంపిణీ చేస్తున్న దృశ్యం



రావికమతం: 22 కౌంటర్లలో నిర్వహిస్తున్న భారీ అన్నసమారాధన



నాతవరం: వి.బి.అగ్రహారం శివాలయంలో మహిళల పూజలు

రావికమతం: ప్రముఖ శైవక్షేత్రమైన కల్యాణపులోవ తిరునాళ్లు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇక్కడకు వచ్చే భక్తులకు ఆలయం వద్ద భారీ చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వేలాది మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు గ్రామీణ తాగునీటి సరఫరా ఆధ్వర్యంలో లక్షల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్నానాల రేవులో మహిళలకు ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక దడులను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు, పోలీసు, ఫైర్ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

మజ్జిగ, లస్సీ పంపిణీ

విశాఖ డెయిరీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, పలు గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ప్రధాన ఆలయం వద్ద మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. ధర్మవరం మదుము వద్ద ఉల్లారి రాజు, కొత్తకోటలో వాసవీ క్లబ్ సభ్యులు మజ్జిగ, పులిహోర పంచిపెట్టారు.

భక్తుడికి గాయాలు..

రిజర్వాయర్ స్నానాల రేవు వద్ద రాళ్లలో మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దాలి సన్యాసి(55)కాలు ఇరుక్కుపోయి విరిగిపోయింది. దీంతో ఆయన్ను పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడ ప్రత్యేక వైద్య శిబిరానికి చేర్చారు. వైద్యాధికారి శ్రీనివాసరావు ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

భక్తులకు సరిపడగా వంటకాలు

ఈ ఏడాది భోజన ఏర్పాట్లపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముందెన్నడూ లేనంతగా నాలుగు టన్నుల రైస్, దానికి తగ్గట్టుగా కూరలు, సాంబారు సిద్ధం చేసి ఉంచడంతో ఇక్కడికి తరలివచ్చిన యాత్రికులందరికీ సంపూర్ణంగా సరిపోయాయి.

ముక్తిదాయిని... ఉత్తరవాహిని

నర్సీపట్నం: బలిఘట్టం ఉత్తరవాహిని నదీ ఒడ్డున త్రిశూల పర్వతంపై బ్రహ్మలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఉత్తరవాహిని నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి స్వామికి లింగోద్భవ కాలమహోన్యాసపూర్వక రుద్రాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మనస్సులో కోరికను గురుదేవుల చెవిలో చెబితే నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ విధంగా చెప్పుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. గురుదేవుల రథోత్సవాన్ని పట్టణంలో భక్తులు ఊరేగించారు. సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేములపూడి పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక వైద్య సేవలందించారు.

దారమఠం శివాలయానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

గొలుగొండ: మహా శివరాత్రి సందర్భంగా దారమఠం శివాలయం, కృష్ణదేవిపేటలో నీలకంఠేశ్వర ఆలయం, చీడిగుమ్మల శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దారమఠం శివాలయానికి గొలుగొండ నుంచి ప్రత్యేక బస్సు సరీ్వసులు ఏర్పాటు చేశారు.

కిటకిటలాడిన చోడవరం గౌరీశ్వరాలయం

చోడవరం: జుత్తాడలో స్ఫటిక లింగేశ్వరస్వామి, ఐదు నందులతో శోభిల్లే గవరవరం శివాలయం, 300 ఏళ్ల చరిత్ర కలిగిన వెంకన్నపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ మూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు పప్పల జయదేవ్, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదం, మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సాయంత్రం సురభి నాట్యమండలి ఆధ్వర్యంలో పాతాళభైరవి, భూకైలాస్ నాటకాలు ప్రదర్శించారు. అన్నమాచార్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యప్రదర్శన, భజనలు, కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు. ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద శారదానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

తాండవలో పుణ్యస్నానాలు

నాతవరం: మహా శివరాత్రి సందర్భంగా వి.బి.అగ్రహారంలోని పురాతన శివాలయంలో భక్తులు పూజలు చేశారు. తాండవ నది ఒడ్డున చమ్మచింత శివాలయానికి భక్తులు తండోప తండోలుగా రావడంతో ఈ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. ఇక్కడ నదిలో నీరు ఉత్తర దిశగా శివాలయం ఎదురుగా ప్రవహించడంతో ఉత్తర వాహినిగా ప్రత్యేకత సంతరించుకుంది. తెల్లవారు నుంచే స్నానమాచరించి శివాలయంలో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మర్రిపాలెం శివాలయంలో 24 గంటల పాటు మహిళలు భజనలు చేశారు. ఆలయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

మార్మోగిన శివనామస్మరణ

మాకవరపాలెం: స్థానిక వామలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగం స్వయంభూలింగం కావడంతో ఇక్కడ అధికంగా భక్తులు తాకిడి కనిపించింది. గిడుతూరులో గంగాధరేశ్వరస్వామి, పి.పి.అగ్రహారంలో అమృతేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాపయ్యపాలెం సమీపంలో దారకొండ, పైడిపాల శివాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు. నారాయణరాజుపేటలో భజన బృందం ఆధ్వర్యంలో శివలింగం తయారు చేసి పూజలు చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు

బుచ్చెయ్యపేట: వడ్డాది సింహబలుడు కొండపై వెలసిన పద్మాలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. దిబ్బిడి శివాలయంలో రుద్రాభిషేకం చేశారు. పలు గ్రామాల్లో ముగ్గులు, పిడతలు, తొప్పెటగుళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

డిప్యూటీ సీఎం పూజలు

మాడుగుల రూరల్: పురాతన శివాలయం ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామివారికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత శివపార్వతులు ఉత్సవ విగ్రహాలను శిరస్సున పెట్టుకుని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటనారాయణ మూర్తి, నాయకుడు పదాల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, స్కూలు కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ పాల్గొన్నారు.

కె.జె.పురంలో క్రీడా పోటీలు

గౌరీ పరమేశ్వర భజన సేవా బృందం సారథ్యంలో కె.జె.పురం శివాలయంలో మూడు వేల మందితో దీపార్చన ఏర్పాటు చేశారు. ముగ్గులతోపాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, తోడపెద్దు సేవ, మహిళల కోలాటం నిర్వహించారు. భక్తులకు చద్ది ఏర్పాటు చేశారు. వి.వి.అగ్రహారం ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయం, దబ్బకుంటు రహదారిలో పార్వతి భీమేశ్వర స్వామి ఆలయం, పిట్టగెడ్డ, జంపెన, వీరనారాయణం శివాలయాల్లో అఖండ నామ సంకీర్తన నిర్వహించారు.

దేవరాపల్లి: స్థానిక బీరకవీధిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి పూజలు చేశారు. బోయిలకింతాడ శివాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తిమిరాం ఉమామహేశ్వర స్వామి ఆలయం, దేవరాపల్లి వనదేవీశ్వర, తదితరు శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

మినీ కైలాసగిరిలో..

రోలుగుంట: మినీ కైలాసగిరిగా వెలుగొందుతున్న బుచ్చింపేటలో శివపార్వతులను, రోలుగుంటలో కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. నిండుగొండ శివాలయంలో సర్పంచ్ శెట్టి సంధ్య, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణ మూర్తి, మాజీ సర్పంచ్ రమణమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకటరాజారావు పూజలు చేశారు.



నాతవరం: చమ్మచింత శివాలయం వద్ద తాండవ నదిలో భక్తుల పుణ్యస్నానాలు



మాకవరపాలెం వామలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



కల్యాణపులోవ విచ్చేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్



చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు



నర్సీపట్నం: బ్రహ్మకుమారీస్ ప్రతిష్ఠించిన శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు



నర్సీపట్నం: పాకలపాడు గురుదేవుల రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు



రోలుగుంట: నిండుగొండ శివాలయంలో శివలింగానికి పూజలు చేసుకుంటున్న భక్తులు



దేవరాపల్లి: బోయిలకింతాడలో భక్తులకు వడ్డన చేస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు



గొలుగొండ: కృష్ణదేవిపేట శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా సింహాద్రప్పన్న గరిడీ, తోడపెద్దు సేవ



చౌడువాడలో కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



సింహాద్రప్పన్న సామూహిక గరిడీ సేవ

కె.కోటపాడు: చౌడువాడలో సింహాద్రప్పన్న సామూహిక గరిడీ, తోడపెద్దు సేవా కార్యక్రమాలు రెండో రోజు శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రప్పన్న మండపంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తున్న ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాలను ప్రత్యేకంగా అభినందించారు. గరిడీ, తోడపెద్దు సేవలో పాల్గొనేందుకు చీపురుపల్లి, బొట్టవానిపాలెం, ముద్దుర్తి, కొత్తపల్లి, గొల్లలపాలెం, దళాయిపాలెం గ్రామాల నుంచి లక్ష్మీ నృసింహస్వామి దాసులు వచ్చారు. మూడు రోజుల పాటు వీరు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు గ్రామపెద్ద ధనిమిశెట్టి అప్పారావు వివరించారు.

శివాలయాల్లో డిప్యూటీ సీఎం పూజలు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పలు గ్రామాల్లోని శివాలయాల్లో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కె.కోటపాడు భీమలింగేశ్వరాలయం, చౌడువాడ కాశీ విశ్వేశ్వరాలయాల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, రాజి శ్రీనివాసరావు, వారాది అప్పారావు, ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్, కుంచా నాగేశ్వరరావు, తనకల అప్పలకోటి, రాజి అప్పలనాయుడు, చిన అప్పారావు, మాలిబాబు, కొండ, సియ్యాద్రి పైడిబాబు పాల్గొన్నారు.

వేడుకగా వడ్డాది వేంకటేశ్వర కల్యాణానికి పెళ్లిరాట



పెళ్లిరాట వేస్తున్న పెద్దలు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి గాంచిన వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి శనివారం పెళ్లిరాట వేశారు. వేదమంత్రాలు, డప్పులు, వాయిద్యాల నడుమ వందలాది మంది పేరంటాలు, పెద్దల సమక్షంలో కనుల పండువగా ఆలయ ముఖద్వారం వద్ద స్వామివారికి పెళ్లిరాట వేశారు. 149 సంవత్సరాలుగా మహా శివరాత్రి పర్వదినాన పెళ్లిరాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. వచ్చే 2వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు వేడుకగా నిర్వహించే స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దొండా కన్నబాబు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఈవో టీఎస్ఎస్ శర్మ, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, దొండా శ్రీరామ్, కుబిరెడ్డి వెంకటరావు, అడపా నర్సింహమూర్తి, పొలిమేర కృష్ణ, బొబ్బరి ఈశ్వరరావు, సయ్యపు రెడ్డి సత్యనారాయణ, కొండబాబు, కోరుకొండ రమణ, పిల్లా చందరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల విజేత అర్జునగిరి

బహుమతులు అందజేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో ఉరకలేస్తున్న ఎడ్లు



కోలాట కళాకారులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దౌడు తీస్తున్న ఎడ్ల బండి

దేవరాపల్లి: జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీల విజేతగా అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కల్లాల్లో దేముళ్లమ్మ పేరంటాలు తీర్థాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఈ పోటీలు హోరా హోరీగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 25 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వీటిలో కె.ఎల్.బి. పట్నం సిరికి దుర్గాప్రసాద్ ఎడ్లు ద్వితీయ, చుక్కపల్లి మజ్జి రాజేష్ ఎడ్లు తృతీయ, లెక్కలవానిపాలెం పైడితల్లమ్మ ఎడ్లు నాలుగు, వావిలపాడు మరిడిమాంబ ఎడ్లు ఐదు, నర్సాపురం సంపత్‌వినాయక ఎడ్లు ఆరు, అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు ఏడో స్థానంలో నిలిచాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ముందుగా దేముళ్ల పేరంటాలను డిప్యూటీ సీఎంతోపాటు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, చల్లా తాతయ్యలు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాట ప్రదర్శన...

దేవరాపల్లి శివారు తగరంపూడి వారి కల్లాల వద్ద నాగమణి పేరంటాలు తీర్థం ఘనంగా జరిగింది. పేరంటాల అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి అభినందించారు. మండల సచివాలయ, గృహసారథుల కన్వీనర్ కె.వి.రమణ, వేచలపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజుబాబు తీర్థం

మాడుగుల: మహా శివరాత్రి పురస్కరించుకుని మాడుగుల సమీపంలో మామిడి వారి కళ్లాల వద్ద పోతురాజుబాబు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎడ్ల బళ్ల పరుగు పోటీలు, పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పోలిమేర విజయలక్ష్మి, పోలిమేర చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్కమ్మ పేరంటాలు తీర్థం

మాడుగుల రూరల్: కాశీపురంలో అక్కమ్మ పేరంటాలు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కమ్మ పేరంటాలకు పసుపు కుంకుమతో భక్తులు పూజలు చేశారు. మేడిశెట్టి కుటుంబ సభ్యుల సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎం. కోడూరు వాసవీ క్లబ్ సభ్యులు సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు విజేత అర్జునగిరి

చీడికాడ: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా చీడికాడ శివాలయం వద్ద నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీల విజేతగా అర్జునగిరికి చెందిన పరువాడ నాయుడు ఎడ్లబండి నిలిచింది. దాతల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో రెండు, ఐదో స్థానాల్లో చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్, అద్దిపల్లి పాలవెల్లి బళ్లు నిలవగా, మూడు, నాలుగు, ఆరో స్థానాల్లో మాడుగుల మండలం కె.జె.పురానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లబళ్లు నిలిచాయి. శివరాత్రి సందర్భంగా పలు గ్రామాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులు శివాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

కోళ్ల పందాలపై పోలీసుల దాడి

ఎస్.రాయవరం : పెనుగొల్లు ధర్మవరం సమీపంలో కోళ్ల పందాలపై దాడులు చేసి ఐదుగురు వ్యక్తుల నుంచి మూడు కోళ్లు , 12 బైకులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి జరిపినట్టు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 29వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గవరపాలెం కామాక్షమ్మదేవి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా కామాక్షమ్మదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారి ఆరాధన మహోత్సవం, మహాశివరాత్రి పురస్కరించుకుని విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వరకూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు కల్యాణ వేడుక జరిపారు.

కొప్పుగొండుపాలెంలో ధర్నా

రాంబిల్లి : కొప్పుగొండుపాలెంలో గల నేవీ గేటు వద్ద ఆయా గ్రామస్థులు శనివారం ధర్నాకు దిగారు. సర్పంచ్ బద్ది హరిబాబు ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. జీవన భృతి కేవలం మత్స్యకారులకే ఇస్తామని అధికారులు చెప్పడంతో తాము ధర్నాకు దిగామని సర్పంచ్ హరిబాబు అన్నారు. తాము కూడా నేవీ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయామని, మత్స్యకారులతో పాటు తమకు కూడా జీవన భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.